క్లుప్తంగా

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

కడియం: ప్రస్తుత సీజన్‌లో వచ్చే జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు ఎస్.నాగసాయిమౌర్య అన్నారు. మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని గుబ్బలవారిపాలెంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 41 మందిని పరీక్షించగా ఏడుగురు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారికి డెంగీ పరీక్ష కూడా చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.శిరీష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేపల పెంపకంపై విద్యార్థులకు శిక్షణ

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు తిలాపియా చేపల పెంపకంపై రెండు రోజుల శిక్షణ తీసుకున్నారని ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. కళాశాలలోని జువాలజీ అధ్యాపకుడు జి.రవితేజ ఆధ్వర్యంలో ఈ విద్యార్థులు కంకిపాడులోని రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్ శిక్షణ శిబిరానికి వెళ్లారన్నారు. అక్కడ తిలాపియా చేపల బయాలజీ, బ్రీడింగ్, గుడ్ల సేకరణ, నర్సరీ రీడింగ్, మౌత్ క్లిప్పింగ్, నీటి సామర్థ్యపు మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై రెండు రోజులు శిక్షణ పొందారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లను అందజేసినట్టు విభాగపు అధిపతి డాక్టర్ శైలజ తెలిపారు.

దుళ్ల వార్డు సభ్యుల నిరసన



నిరసన తెలుపుతున్న దుళ్ల పంచాయతీ వార్డు సభ్యులు

కడియం: మండలంలోని దుళ్ల గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు శుక్రవారం నిరసన తెలిపారు. సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించడంపై ప్రశ్నించారు. కొత్త కార్యదర్శిగా వీడీవీ లక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన ఎటువంటి అజెండాను వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వలేదు. దీంతో వారందరూ నిరసన వ్యక్తం చేశారు. అయితే సమావేశాన్ని వాయిదా వేసినట్లుగా నమోదు చేయడంతో విరమించారు.

నేటి నుంచి మహిళలకు శిక్షణ

కడియం: గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా సభ్యులు, వారి పిల్లలకు పువ్వులతో అగరబత్తి తయారీపై శిక్షణ కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా పది రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మొదటి విడతలో భాగంగా కడియం, కడియపులంక, కడియపుసావరం, దామిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన మహిళలను ఎంపిక చేశామన్నారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాన్ని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రారంభిస్తారన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు ఆనంద్ మృతి



ఉసురుమర్తి ఆనంద్ (ఫైల్)

కంబాలచెరువు: కంబాలపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఉసురుమర్తి ఆనంద్ (38) శుక్రవారం మృతి చెందాడు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆనంద్ నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. ఆయన భౌతిక దేహాన్ని వై.జంక్షన్ సమీపంలోని వెంకీ హోటల్ వెనుకనున్న ఆయన ఇంటి వద్ద ఉంచారు. శనివారం జాంపేట క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో అంత్యక్రియలు జరగనున్నాయి. ఆనంద్ మృతితో నగరంలోని పలువురు నాయకులు ఆయన ఇంటికి చేరుకుని నివాళులర్పించారు.

కెనాల్ రోడ్డులో ఆటో బోల్తా



రోడ్డుపై బోల్తా పడిన ఆటో

కడియం: వేమగిరి కెనాల్ రోడ్డులోని గోతులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి పైపుల లోడుతో వెళ్తున్న ఆటో రోడ్డుపై గుంతలో దిగి బోల్తా పడింది. కాగా.. ఈ రోడ్డులోని గోతుల కారణంగా ప్రయాణానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నామమాత్రంగా మరమ్మతులు చేస్తున్నా పరిస్థితి మళ్లీ యథాస్థితికి చేరుతోంది. అధికారులు స్పందించి రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఆటల్లో మేటి.. పతకాలకు పోటీ

- రాజమహేంద్రవరం క్రీడాకారుల సత్తా
- పలు టోర్నమెంట్లలో విజయ కేతనం
- చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం



జాతీయ స్కూల్ గేమ్స్ అండర్ -19 బాక్సింగ్‌లో సత్తా చాటిన అక్షితను అభినందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

ప్రకాశం నగర్: సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. విద్యతో పాటు ఆటలకూ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. బాక్సింగ్, యోగా వంటి వాటిలో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపిక కావడంతో పాటు అక్కడ ప్రతిభ చూపి పతకాలు సాధిస్తున్నారు. రాజమహేంద్రవరం ఖ్యాతిని దశదిశాల వ్యాప్తి చేస్తున్నారు. ఇటీవల జరిగిన జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ కె.ప్రశాంతి ప్రత్యేకంగా అభినందించారు. వారికి సర్టిఫికెట్లు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. మొత్తం పది మంది క్రీడాకారులు జిల్లా నుంచి ఎంపిక కాగా, వీరిలో వీరిలో నగరానికి చెందిన ఇద్దరు క్రీడాకారిణులు ఉన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా

జాతీయ స్థాయి పోటీలలోనూ మన క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. అక్కడ పథకాలు సాధించి మన జిల్లా పేరును నిలబెడుతున్నారు. ఇలాంటి వారికి ప్రోత్సాహంతో అభినందనలు చాలా అవసరం. ఇటీవల జరిగిన జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఆయా క్రీడాకారుణులను కలెక్టర్ ప్రశాంతి ఘనంగా సత్కరించారు. మరిన్ని విజయాలు సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. కలెక్టర్ అభినందించిన వారిలో జాతీయ టైక్వాండో 73 కేజీల విభాగంలో వెండి పతకం సాధించిన గుబ్బల మేరీగోల్డ్, జాతీయ కిక్ బాక్సింగ్ 73 కేజీల విభాగంలో బంగారు పతకంతో సత్తా చాటిన నల్ల ప్రజ్ఞ, సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్‌లో పాల్గొన్న గౌతమ్, జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అండర్ – 13 విభాగంలో పాల్గొన్న వెంకట చైతన్య, 46వ జాతీయస్థాయి ఇండియన్ మాస్టర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న డి.రుద్రకుమార్, జాతీయ జూనియర్ మహిళల 97 కేజీల కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించిన కె.దివ్యశ్రీ ,అంతర్జాతీయ మానస్ ఇండో బాంగ్లా ఫ్రెండ్షిప్ కప్ 2023 వీల్ చైర్ క్రికెట్ టీం టీ20లో పాల్గొన్న ఎం.ప్రవీణ్ కుమార్, 3వ జాతీయ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన వీవీ కిరణ్మయి, 67వ జాతీయ స్కూల్ గేమ్స్ అండర్ – 19 విభాగంలో బాక్సింగ్‌లో పాల్గొన్న జి.అక్షిత, 2వ ఎస్‌వైఎస్ఎఫ్ జాతీయ యోగా పోటీల్లో పాల్గొని గిన్నిస్ రికార్డ్ సాధించిన వి.సాత్విక తదితరులు ఉన్నారు.

శిక్షణతో మంచి ఫలితాలు

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్కూల్ గేమ్స్, ఆడుదాం ఆంధ్రా పేరుతో పలు క్రీడా పోటీలను నిర్వహించింది. ఆయా క్రీడలకు సంబంధించిన కిట్లకు వారికి అందించడంతో పాటు విజేతలకు నగదు బహుమతులను అందజేసింది. ప్రస్తుత విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకు ఆయా పీడీలు కృషి చేస్తున్నప్పటికీ ప్రభుత్వ సహకారం అందించకపోవడంతో శిక్షణ అంతంత మాత్రంగానే సాగుతుంది.

హోటళ్లలో అధికారుల తనిఖీలు



పందలపాక అప్పారావు హోటల్ వద్ద అధికారులు

కంబాలచెరువు: నగరంలోని రెస్టారెంట్లలో రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆహార తనిఖీ శాఖాధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఎస్పీ కేఎస్‌వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని కేఎఫ్‌సీ, పందలపాక బిర్యానీ హోటళ్లపై దాడులు చేసి కేసులు నమోదు చేశారు. కేఎఫ్‌సీలో వంటకు ఉపయోగిస్తున్న ఆయిల్ టీఎఫ్‌సీ పరిమితికి దాటి ఉండటాన్ని అధికారులు గుర్తించారు. దాని సాంద్రతను పరీక్షించగా 25 శాతం లోపు ఉండాల్సిన టోటల్ పోలార్ కాంపౌండ్స్ (టీఎఫ్‌సీ) 39.5 శాతంగా నమోదైంది. దీంతో ఆ హోటల్‌పై కేసు నమోదు చేశారు. అక్కడి చికెన్‌ను, ఫ్రై చేయడానికి సిద్ధం చేసిన ఆయిల్‌ను నమూనాలను తీసుకుని ల్యాబ్‌కు పంపారు.

పందలపాక అప్పారావు హోటల్‌పై..

గోకవరం బస్టాండ్ వద్ద నున్న పందలపాక అప్పారావు హోటల్‌పై అధికారులు దాడి చేసి కేసు నమోదు చేశారు. హోటల్‌లో తయారు చేసి తినడానికి రెడీ చేసిన చికెన్ ఫ్రై నమూనాలను నాణ్యత పరీక్ష కోసం హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. హోటల్ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో నోటీసులు జారీ చేశారు. అక్కడ స్టాంప్ లేని తూకం యంత్రం వినియోగించడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు ఆ మెషీన్‌ను సీజ్ చేసి, మరో కేసు నమోదు చేశారు. గృహావసరాలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్లను హోటల్లో వాడడంతో సివిల్ సప్లయిస్ అధికారులు వాటిని సీజ్ చేసి కేసు కట్టారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై జగన్నాథరెడ్డి, డీసీటీవో నవీన్‌కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య, లీగల్ మెట్రాలజీ అధికారి బాలాజీ, వలీ, కిశోర్, శివ, లోవరాజు, వీరబాబు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిరంతర కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేనేజర్ సురేష్ కుమార్

కంబాలచెరువు: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని రాజమహేంద్రవరంలోని హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హార్లిక్స్ ఫ్యాక్టరీ) మేనేజర్ ఆర్.సురేష్ కుమార్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో కొత్తగా చేరిన డిగ్రీ విద్యార్థులకు పదిహేను రోజులుగా నిర్వహిస్తున్న ఇండక్షన్ ప్రోగ్రామ్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మక కలను సాకారం చేసుకోవడానికి నిబద్ధత, క్రమశిక్షణ, సహనం అవసరమన్నారు. ముఖ్యంగా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎన్‌సీలలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సాధించడానికి, విద్యార్థులు ప్రపంచ దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరించారు. కెమిస్ట్రీ అధ్యాపకుడు బి.వెంకటరావు సమన్వయకర్తగా, కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కెమిస్ట్రీ విభాగం ఇన్‌చార్జి టి.శ్రీనివాసరావు కన్వీనర్‌గా వ్యవహరించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కంబాలచెరువు: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల గరల్స్ హాస్టల్ వాష్ రూమ్‌లో హిడెన్ కెమెరాలు అమర్చిన దోషులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ సదరు కాలేజీలో చదువుతున్న విద్యార్థులే కొందరు సీనియర్ల సాయంతో కెమెరాలను అమర్చినట్టు వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని యాజమాన్యానికి వారం రోజుల క్రితమే విద్యార్థినులు తెలియజేసినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. దీనిలో కేవలం సీనియర్ విద్యార్థుల ప్రమేయం మాత్రమే ఉందా లేకపోతే యాజమాన్యం, అక్కడ పనిచేసే వ్యక్తులకు సంబంధముందా అనే విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఎస్‌పీఎఫ్ కానిస్టేబుళ్ల యూనిఫాంలో మార్పు



ఎస్‌పీఎఫ్ సిబ్బందితో జోన్ కమాండెంట్ నరసింహారావు

కంబాలచెరువు: ఏపీ ప్రత్యేక రక్షణ దళంలో పనిచేస్తున్న కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లకు యూనిఫాంలో కొన్ని మార్పు చేశారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం ఎస్‌పీఎఫ్ కార్యాలయంలో జోన్ కమాండెంట్ డాక్టర్ కె.నర్సింహారావు శుక్రవారం సిబ్బందికి వాటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రక్షణ దళాధిపతి సీఎం త్రివిక్రమ వర్మ ప్రతిపాదనల మేరకు ఏపీ ప్రభుత్వ హోంశాఖ ద్వారా ప్రస్తుతం ధరిస్తున్న ఖాకీ బ్యారెట్ క్యాప్, రెడ్ లెదర్ బెల్ట్, భుజంపై ధరించే లోగోలో మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఇప్పటి నుంచి కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ స్థాయి వారికి ఖాకీ బ్యారెట్ క్యాప్ బదులుగా ప్రస్తుతం పోలీసు శాఖలో ధరిస్తున్న మాదిరిగా బ్లూ పీక్ క్యాప్, రెడ్ లెదర్ బెల్ట్ బదులుగా బ్లాక్ లెదర్ బెల్ట్, భుజానికి ధరించే లోగోలో పూర్ణకుంభానికి బదులుగా గండభేరుండ పక్షి కలిగిన లోగోను సిబ్బంది అందరూ ధరించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు పీవీఎస్‌ఏడీ.ప్రసాదరావు, ఓ.కృష్ణయ్య పాల్గొన్నారు.

యూపీఎస్‌పై యూటీఎఫ్ నాయకుల నిరసన



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణ్ కుమారి మాట్లాడుతూ 2004 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను అమలు చేస్తున్నారన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల హక్కు అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టి సీపీఎస్‌ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని 20 ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటం చేసిన ఫలితంగా కొన్ని రాష్ట్రాలలో పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో గ్యారంటీడ్ పెన్షన్ స్కీం జీపీఎస్‌ను తెచ్చి సీపీఎస్ కంటే మెరుగైనదని నమ్మబలికిందన్నారు. దీనిని ఉద్యోగ ఉపాధ్యాయులు తిరస్కరించాలని పిలుపు నిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎన్.రవిబాబు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల కంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కె.లక్ష్మీశివజ్యోతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కె.రమేష్ బాబు, సీహెచ్ దయానిధి, కేవీఎస్ ప్రకాశరావు, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సేవాదృక్పథం అలవర్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులతో ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: చిన్ననాటి నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అధ్యక్షుడు నాళం నరసింహారావు పిలుపు నిచ్చారు. నగరంలోని లిటిల్ ప్యారడైజ్ స్కూల్లో శుక్రవారం ఇంట్రాక్ట్ క్లబ్ ఆఫ్ లిటిల్ పారడైస్ రాజమండ్రి రివర్ సిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 2024 – 25 అధ్యక్షురాలిగా కె.అన్నీ శాన్విక్, కార్యదర్శిగా ఆర్.వరుణ్ సంజయ్‌లను రోటరీ ఇంటర్నేషనల్ లాంఛనాలతో నియమించారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ 3020 అసిస్టెంట్ గవర్నర్ పీవీఎస్ఎస్ దొరబాబు, రొటేరియన్ సుంకర నాగేంద్ర కిషోర్, జిల్లా రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ మెంబర్ డాక్టర్ మహాలక్ష్మి, బచ్చు సత్యానందం పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ అవసరం



ఉషు పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రకాశం నగర్: మహిళల ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం చాలా అవసరమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఫారెస్ట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హాల్లో రెండు రోజుల పాటు జరిగే 9వ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉషు సీనియర్ అండ్ సబ్ జూనియర్ చాంపియన్ షిప్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఆదిశేషు, కార్యనిర్వాహకులు బి.నరసింహారావు, ఉషు అసోసియేషన్ అధ్యక్షుడు అజ్జరపు వాసు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాల ప్రారంభం

స్థానిక 47వ డివిజన్‌లో నిర్మించిన రెండు అంగన్‌వాడీ భవనాలను శుక్రవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి బేసరి చిన్ని, మాజీ కార్పొరేటర్ రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి



కడియంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ ప్రసాద్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. పిడింగొయ్యి పంచాయతీ పరిధి కవలగొయ్యిలోని ఫ్యూచర్‌కిడ్స్ స్కూల్‌కు ఎదురుగా ఉన్న స్థలంలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మొక్కలు నాటారు. మండల ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ రవిబాబు యేలేటి, పంచాయతీ కార్యదర్శి ముదునూరి రూప్‌చంద్, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ పాల్గొన్నారు.

సమష్టి బాధ్యత

కడియం: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ వెలుగుబంటి సత్యవరప్రసాద్ అన్నారు. హరితాంధ్ర కోసం అడుగేద్దాం – ప్రతి ఒక్కరం మొక్కలు నాటుదాం అనే నినాదంతో వనమహోత్సవం 2024 కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి ప్రారంభించారు. కడియపులంక సర్పంచ్ పాటంశెట్టి రాంజీ మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాలలో మొక్కలు నాటి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. వైస్ ఎంపీపీ గణపతి, ఎంపీడీవో కె.రత్నకుమారి, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురాం, గ్రీన్ కోర్ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ మోసిగంటి సత్యవతి పాల్గొన్నారు.



ఆల్కాట్‌తోటలో విద్యుత్ తీగలను అల్లుకున్న తుప్పలు

పాదులు కాదు..


బతాని తుప్పలు

సాధారణంగా కూరగాయల పాదులు ఎగబాకడానికి గ్రామాలలో పందిళ్లు వేస్తారు. పాదు పెరిగిన తర్వాత పందిరిని అల్లుకుంటుంది. తర్వాత దిగుబడి బాగా వస్తుంది. రాజమహేంద్రవరం నగరం, రూరల్ ప్రాంతాల్లో కూడా ఇలాంటి పచ్చని పాదులు అనేక చోట్ల కనిపిస్తాయి. కానీ అవి కూరగాయల పాదులు కాదు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలను అల్లుకున్న బతానీ తుప్పలు. వీటి వల్ల ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ఆ విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

– రాజమహేంద్రవరం రూరల్



జాతీయ రహదారిపై బొమ్మూరు సమీపంలో..



బొమ్మూరు ఎంఆర్‌టీ పక్కరోడ్డులో..



బాలాజీపేట సెంటర్ నుంచి పై ఓవర్‌కు వెళ్లే దారిలో..

రీసెర్చ్ స్కాలర్ మాధురికి డాక్టరేట్

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల రీసెర్చ్ స్కాలర్ పి.మాధురి సంతోషి డాక్టరేట్ అందుకున్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రిజిస్టర్ అయిన ఆమె ఆర్ట్స్ కళాశాలలోని క్రిస్టల్ గ్రోత్ అండ్ నానో సైన్స్ రీసెర్చ్ సెంటర్‌లో భౌతిక శాస్త్రంలో పరిశోధన చేశారు. డాక్టర్ కె.రామచంద్రరావు మార్గదర్శకత్వంలో రేర్ ఎర్త్ మెటల్ (ఈయూ, సీయూ) ఆప్టికల్, యాంటీమైక్రోబయల్ పరిశోధనల కోసం అకర్బన స్ఫటికాలు అనే అంశంపై పనిచేశారు.

తెగిపడిన విద్యుత్ తీగ

రంగంపేట: ఈలకొలను గ్రామంలోని మెయిన్ రోడ్డులో శుక్రవారం విద్యుత్ తీగ తెగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తీగ పడిన వెంటనే స్థానికులు విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. గ్రామ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్తు లైన్లు అస్తవ్యస్తంగా ఉండటమే కాకుండా తెగిపోవడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సంఘటనా స్థలానికి వచ్చిన విద్యుత్ సిబ్బందిని ఆయన నిలదీశారు. సమస్యనుపై అధికారులకు తెలియజేశామని, వర్షం తగ్గిన తరువాత సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్తు సిబ్బంది తెలిపారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

రాజానగరం: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాక్ సిరామిక్స్ హెచ్ఆర్ హెడ్ డాక్టర్ టి.మనోజ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. స్థానిక గైట్ డిగ్రీ కాలేజీలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం, ఎన్ఐపీఎం గోదావరి స్టూడెంట్ చాప్టర్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులను లక్ష్య సాధనలో కార్యోన్ముఖులను చేసే ప్రయత్నం చేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ ఆదాని గ్రూప్ జీఎం హెచ్ఆర్ డాక్టర్ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ పీఆర్‌కే రాజు పాల్గొన్నారు.

జీజీయూలో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఫిక్కీ ఎనర్జీ మేనేజర్ అలీ అహ్మద్

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వాణి పథకంపై రెండు రోజులు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. పెట్రోలియం విభాగం ఆధ్వర్యంలో విద్యుత్ వాహనాలలో ఉపయోగించి వదిలేసిన బ్యాటరీల నుంచి పర్యావరణంలో వస్తున్న వివిధ పరిణామాలు అనే అంశం పై ఈ వర్క్‌షాప్ జరిగింది. విజయవాడలోని ఫిక్కీ ఎనర్జీ మేనేజర్ మోహార్ అలీ ఆహ్మద్ మాట్లాడుతూ బ్యాటరీల వలన పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్, కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్వీఆర్ నాగలక్ష్మి, హెచ్ఓడీ ఎండీ అహ్మద్ షరీఫ్, హెచ్ఓడీ డాక్టర్ వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.